ప్రజాశక్తి
ఆదివారం 5 మార్చి 2023



అపరాల కొనుగోలుకు సిద్ధం

ఆర్‌బికెల్లో పేర్లు నమోదు: జెసి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా 2022-23 రబీ సీజన్‌లో అపరాల కొనుగోలుకు నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. శనివారం ఆయనొక ప్రకటనను విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యాన రబీలో అపరాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. క్వింటా మినుములు రూ.6,600, క్వింటా పెసలు రూ.7,755గా మద్దతు ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ-క్రాప్, ఈ-కెవైసి చేయించుకున్న రైతులు తమ పంటను మద్దతుధరకు విక్రయించేందుకు తమ సమీపంలోని ఆర్‌బికెల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పంట విక్రయించే రైతులు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పంటను శుభ్రపరచి, జల్లెడపట్టి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులందరూ సద్వినియోగించుకోవాలని జెసి కోరారు.

పేద పిల్లలకు ఉచిత విద్య

- 25 శాతం సీట్లు కేటాయింపు
- ఫీజు చెల్లించనున్న ప్రభుత్వం



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రైవేటు పాఠశాలల్లో 2023-24 ఏడాదికి ఒకటో తరగతిలో చదివేందుకు పేద పిల్లలకు 25శాతం సీట్ల కేటాయింపునకు సంబంధించిన ప్రకటన విడుదలైంది. ఈ విషయంలో అన్ని యాజమాన్యాలు విద్యా హక్కు చట్టం నిబంధనలు పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. గతేడాది నుంచే ఇది అమలవుతోంది. 2022-23 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ఆలస్యమవడంతో జిల్లాల్లో 106 మందికే అవకాశం దక్కింది. రానున్న విద్యా సంవత్సరానికి ముందుగా ప్రకటన విడుదల చేయడంతో ఎక్కువ మందికి మేలు కలుగుతుందని భావిస్తున్నారు.

జిల్లాల్లో 460 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 392 కొనసాగుతున్నాయి. వాటిలో ప్రవేశం కల్పిస్తే విద్యార్థుల తరపున రుసుముల్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. సెక్షన్‌కు నిర్దేశించిన (40 మంది) విధంగా ఖాళీ సీట్లను కేటాయిస్తారు. యాజమాన్యాలు అదనపు సెక్షన్లు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాల్లో ప్రైవేటులో సుమారు 12వేల మంది ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందారు. ఈ లెక్కన వచ్చే విద్యా సంవత్సరం 3వేల మంది సీట్లు పొందేందుకు అవకాశం ఉందని అంచనా.

సీట్ల కేటాయింపు ఇలా..

దరఖాస్తుదారులు రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాల (అనాథ పిల్లలు, హెచ్‌ఐవి బాధితుల పిల్లల)కు 5 శాతం, ఎస్‌సి 10, ఎస్‌టి 4, బలహీనవర్గాల (బిసి, మైనార్టీ, ఒసి)కు 6శాతం సీట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతంలో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,20,000, పట్టణాల్లో రూ.1,40,000 లోపు ఉన్న వారికే అవకాశం ఉంటుంది.

16 వరకు దరఖాస్తుల స్వీకరణ

చట్టంలో పేర్కొన్న విధంగా సిబిఎస్‌ఇ తరగతుల్లో ప్రవేశాలు కల్పించాలి. గతేడాది ఆన్‌లైన్‌లో పాఠశాలల జాబితాను పొందుపర్చినా, క్షేత్రస్థాయిలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఎక్కువ భాగం రాష్ట్ర సిలబస్ ఉన్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన వాటిలో తక్కువ పాఠశాలలు సిబిఎస్‌ఇ బోధిస్తున్నారు. ఈ నిబంధన అమలయ్యే విధంగా పునఃపరిశీలన చేయాలి.

ఏప్రిల్ 30లోగా ప్రవేశాలు



ఈ నెల ఆరో తేదీ నుంచి దరఖాస్తులకు పోర్టల్ అందుబాటులోకి రానుంది. ఆన్‌లైన్‌లో 16వ తేదీ వరకు http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. అర్హులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేస్తారు. ఏప్రిల్ 13, 25వ తేదీల్లో రెండు విడతలుగా ఫలితాలు ప్రకటిస్తారు. ఏప్రిల్ 30లోగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

-గార పగడాలమ్మ,
డిఇఒ, శ్రీకాకుళం



పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలిస్తున్న నవీన్

పోలింగ్‌కు సర్వం సిద్ధం

జెసి ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, పట్టభద్రుల శాసనమండలికి 59 కేంద్రాలు కలిపి మొత్తం 63 కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెసి ఎం.నవీన్ తెలిపారు వీటి కోసం 300 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో, జెడ్‌పిలో ఉన్న స్ట్రాంగ్ రూములు, పోలింగ్ మెటీరియల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పించామని అన్నారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 52వేల మంది ఓటర్లు ఉన్నారని, స్థానిక సంస్థలకు 776 మంది ఓటర్లు ఉన్నారని జెసి తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 38 మండలాల పరిధిలో ఉన్న ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని అన్నారు. నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో స్థానిక సంస్థలకు నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టభద్రుల శాసనమండలికి సంబంధించి ఓటర్లకు ఓటింగ్ స్లిప్‌ల పంపిణీ 40శాతం పూర్తయిందని, మిగిలిన 60శాతం మూడు రోజుల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సిసిటీవీలు ఏర్పాటు చేస్తున్నామని, ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని జెసి నవీన్ అన్నారు. ఈ ఎన్నికలకు సుమారు 2వేల మంది సిబ్బందిని విధులకు వినియోగిస్తున్నామని ఆయన చెప్పారు.



సంఘీభావం తెలుపున్న అమరావతి జెఎసి నాయకులు

పిఎఫ్ డబ్బులు జమయ్యేలా చర్యలు

(6లో)

9 నుంచి ఉద్యమానికి సిద్ధం కావాలి

అమరావతి జెఎసి పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల దీర్ఘకాలిక ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోరుతూ అమరావతి జెఎసి పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీ నుంచి దశల వారీ ఉద్యమానికి ఉద్యోగులు సిద్ధం కావాలని జెఎసి చైర్మన్ కె.శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని రెవెన్యూ అతిథి గృహంలో జెఎసి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరి 11న పిఆర్‌సి అమలులో భాగంగా జరిగిన ఉద్యమం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అమలు చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని తెలిపారు. వీటి పరిష్కారం కోరుతూ ఈ నెల 9 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు దశల వారీ ఉద్యమానికి సిద్ధపడి, ఆందోళన కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమం ప్రభుత్వ వ్యతిరేక పోరాటంకానే కాదని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న పోరాటమన్నారు. ఎపి అమరావతి జెఎసి నాయకులు డిజి.ప్రసాద్, అంజనీకుమార్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల ఎవరికి చెప్పుకోవాలో తెలియని నిస్సహాయ స్థితిలో ఉద్యోగులు ఉన్నారని అన్నారు. ఉద్యోగుల జీతభత్యాల కోసం కేటాయించిన బడ్జెట్ దారి మళ్లించడం తగదన్నారు. ప్రతి నెలా పనిచేసిన కాలానికి ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఉద్యోగులు జీవిత కాలం పాటు దాచుకున్న డబ్బులు ఏమవుతున్నాయో బహిరంగ పరచాలన్నారు. ఆ డబ్బును ప్రభుత్వం వాడుకోకపోతే సకాలంలో కుటుంబ అవసరాల కోసం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు.ఉద్యోగులకు రావాల్సిన అరియర్స్, డిఎ బకాయిలు, కొత్త డిఎ, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్లు, మెడికల్ రీయంబర్సుమెంట్ బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యమం వల్ల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగినా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. అనంతరం నగర పాలక సంస్థ, జెడ్‌పి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను సంఘాల నాయకులు సందర్శించి, ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పల వేణుగోపాల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బివివిఎన్.రాజు,ఎస్.గోవిందరావు, డి.పి.దేవ్, పి.పి.సూర్యనారాయణ, జివిఎల్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే కిడ్నీ వ్యాధి దూరం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ప్రజలు ఆరోగ్యం, ఆహారపు అలవాట్లపైన సరైన అవగాహన ఏర్పర్చుకొని, ముందస్తు పరీక్షల ద్వారా కిడ్నీ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం మండలంలోని గోవిందపురం, అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జిల్లా లీగల్‌సెల్ ఆధ్వర్యాన కిడ్నీ రోగులకు మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై చైతన్యవంతులు కావాలన్నారు. పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ కేంద్రం ఈ ప్రాంత వాసులకు వరం లాంటిదని అన్నారు. గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వసతులను జిల్లా లీగల్‌సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ పి.రవిశంకర్, డిఎంఅండ్‌హెచ్‌ఒ బి.మీనాక్షితో కలిసి పరిశీలించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించి, కిడ్నీ రోగులతో మాట్లాడారు. పాలిన శ్రీనివాసరావు, పాలిన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గోవిందపురం పిహెచ్‌సిలో 24 గంటల పాటు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిఎంఅండ్‌హెచ్‌ఒను కోరారు. పిహెచ్‌సికి రహదారి సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రహదారి నిర్మాణానికి రైల్వే అధికారుల అనుమతి తప్పనిసరి కావడంతో తాము ఎన్ని ప్రయత్నాలు చేసునాన్న ఇప్పటివరకు నిర్మించలేకపోయామని, ఈ సమస్యపై జడ్జి సహకరించాలని వారు కోరారు. ఈ విషయంపై వినతిపత్రం ఇస్తే రైల్వే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని జిల్లా జడ్జి తెలిపారు. డిఎంఅండ్‌హెచ్‌ఒ మాట్లాడుతూ గోవిందపురం పిహెచ్‌సి 24 గంటలూ పని చేసేలా చర్యలు తీసుకుంటామని, డయాసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గోవిందపురం పిహెచ్‌సి వద్ద 389 మంది పరీక్షించుగా, వారిలో 19 మంది పాత సికెడి రోగులు ఉండగా, మిగితా వారికి బిపి, మధుమేహం, ఎచ్‌బి ఎలక్ట్రోలైట్స్, క్రియేటివ్, యూరియా పరీక్షలు చేశారు. కొత్తగా కిడ్నీ కేసులు బయటపడితే వారికి వ్యాధిపై అవగాహన కల్పించి మందులు ఇస్తామనివైద్యులు సుధీర్ తెలిపారు. తొలుత జిల్లా జడ్జిని పాలిన శ్రీనివాసరావు, పాలిన ఉమామహేశ్వరరావు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో భగవాన్, మోహనరావు, వైద్యులు సుధీర్, ప్రత్యూష, చలమయ్య, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, కాశీబుగ్గ రూరల్ సిఐ శంకర్‌రావు, ఎస్ఐ మధుసూదన్, మురళి, అడ్వకేట్లు అనిల్‌రాజ్, దేవరాజ్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జడ్జికి సమస్యను వివరిస్తున్న శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు

19న మిస్టర్ ఆంధ్రా పోటీలు

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈ నెల 19న నిర్వహించనున్న 25వ రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తన చాంబరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపి బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 19న నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.1,15,000 నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్టు తెలిపారు.

ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 350 మంది బాడీబిల్డర్లు పాల్గొంటారని, వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎన్.ఈశ్వరరావు, ఎం.వి.మల్లేశ్వరరావు, జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జాతీయ సమైక్యతకు కృషి చేయాలి

- బిఆర్‌ఎయు విసి వెంకటరావు
- మాంత్రిక రాజాస్ మేజికల్ ఒడిస్సే ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జాతీయ సమైక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. కళాకాంత్ ఫౌండేషన్, రజిని రాజా కళాక్షేత్రం ఆధ్వర్యాన మాంత్రిక రాజాస్ మేజికల్ ఒడిస్సే ఫర్ నేషనల్ ఇంటిగ్రేషన్ కార్యక్రమాన్ని ఎచ్చెర్ల అంబేద్కర్ యూనివర్సిటీ కళా ప్రాంగణంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మాంత్రిక రాజా ఇంద్రజాల ప్రదర్శన ద్వారా జాతీయ సమైక్యత కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. లాభాపేక్ష లేకుండా ప్రేక్షకులను మెప్పిస్తూ ఒక వైపు దేశభక్తిని పెంపొందిస్తూ మరోవైపు మూఢనమ్మకాలను నిరోధించే ప్రయత్నం చేస్తూ ముందుకు సాగడం ప్రశంసనీయమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చిన శ్రీనివాసరాజు తమ యూనివర్శిటీలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారని ఆయన కొనియాడారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలన, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కళ్లకు గంతలు కట్టుకొని ఎన్నో ప్రదర్శనలు ఇచ్చిన శ్రీనివాసరాజు ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు ప్రదర్శనలు సిక్కోలు నుంచే ప్రారంభించడం మంచి పరిణామమన్నారు. అనంతరం ఐలవ్ ఇండియా పోస్టర్ ప్రమాణ పత్రాన్ని విసి ఆవిష్కరించారు. యూనివర్సిటీలో వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ డిజైన్, దేశభక్తి గీతాలకు సంబంధించిన పోటీలు నిర్వహించి, విజేతలకు, పాల్గొన్న వారందరికీ ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రారంభించిన నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్, వివిధ పోటీల నిర్వహణ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ అనురాధ, న్యాయనిర్ణేతలు డాక్టర్ వనజ, డాక్టర్ జెకెఎల్ సుజాత, డాక్టర్ శాంతి, డాక్టర్ రమణమూర్తి, రజనీ, ఆకాష్, తరుణ్, నీరజ్, ప్రేమ్ పాల్గొన్నారు.



విజేతలతో విసి వెంకటరావు, తదితరులు



మాట్లాడుతున్న సత్యనారాయణ

రాష్ట్రంలో రాక్షస పాలన

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పలాస

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూకబ్జాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. మంత్రులు ఇష్టానుసారంగా బూతులు మాట్లాడుతున్నారని, అటువంటి బూతులు మాట్లాడం మాకు రాదా? అని ప్రశ్నించారు. పలాస నియోజకవర్గంలో స్థానిక మంత్రి కొత్త సంస్కృతికి తెరలేపారని, అధికారం శాశ్వతం కాదని, ఈ విషయం తెలుసుకోవాలని చెప్పారు. మంత్రి హుందాగా వ్యవహరించాలే తప్ప చీప్ ట్రిక్స్ ప్లే చేయడం ఆ పదవికే సిగ్గు చేటు అన్నారు. సమావేశంలో మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, లోడగల కామేష్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, సాంబమూర్తి, శశిభూషణ్, సూరాడ మెహనరావు, ఉమామహేశ్వరరావు, భావన దుర్యోధన, రట్టి లింగరాజు, రుద్రయ్య, జికె నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో నిర్లక్ష్యం వద్దు

డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉపాధి హామీ కూలీలందరికీ సగటు వేతనం పెంపులో సిబ్బంది నిర్లక్ష్య ధోరణి సరికాదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. కలెక్టరేట్ సమీపంలోని డ్వామా కార్యాలయ ఆవరణలో శనివారం కొత్తూరు మండల సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో సగటు వేతనం చాలా తక్కువగా ఉందని, ఈ ధోరణి మారనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు సామాజిక తనిఖీ డిఆర్‌పిలు మండలంలో తాము నిర్వహించిన తనిఖీల నివేదికను చదివి వినిపించారు. కొన్ని ప్రాంతాల్లో ప్లాంటేషన్ పనుల్లో భాగంగా నాటిన మొక్కలు కొంతమేర లేవని డిఆర్‌పిలు తెలిపారు. సిఇఒ మాట్లాడుతూ సామాజిక తనిఖీ నివేదికల ప్రాప్తికి విచారణ జరిపి, నిధులు రికవరీ చేయడంతో పాటు అవసరమైతే చర్యలు తీసుకుంటామని అన్నారు. మస్టర్ షీట్లలో ఎటువంటి దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. మండల, పంచాయతీ స్థాయిలో ఎర్రర్ రిజిస్టర్లు తప్పకుండా నిర్వహించాలన్నారు. మీరు ఎంత బాగా పనిచేశారు అనేందుకు నిదర్శనం రికార్డుల నిర్వహణేనని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులు క్షేత్రస్థాయిలో అందరినీ సమన్వయం చేసుకొని విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పని ప్రదేశాల వద్ద ఆయా పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నేమ్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉపాధి హామీ పథకం విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఎపిడి పి.రాధ, హెచ్‌ఆర్ మేనేజర్ పి.శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు



మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

ప్రజాశక్తి- పలాస

ఈనెల 13న నిర్వహించనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ, స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డిఒ పి.సీతారామ్మూర్తి అధికారులకు ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో పలాస డివిజన్ పరిధిలోని పోలీసులతో, తహశీల్దార్‌లతో శనివారం ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలను పలాస తహశీల్దార్ కార్యాలయంలో, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ప్రతి మండల కేంద్రంలో ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందుకు సంబంధించి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తులు ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఎస్‌పి శివరాంరెడ్డి, వివిధ మండలాల తహశీల్దార్లు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఆడిట్ పూర్తి

ప్రజాశక్తి- పొందూరు

మార్చి 31లోగా స్వయం సహాయకశక్తి మహిళా సంఘాల ఆడిట్‌ను పూర్తి చేయనున్నట్లు ఎపిఒ గురుగుబెల్లి శ్యామలరావు పేర్కొన్నారు. పొందూరులో చేపడుతున్న స్వయం సహాయకశక్తి మహిళా సంఘాల ఆడిట్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 39 గ్రామైక్య సంఘాల పరిధిలో ఉన్న 1,739 ఎస్‌హెచ్‌జి ఆడిట్‌ను చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటివరకూ మండలంలో 21 గ్రామైక్య సంఘాల పరిదిలోని 1,025 సంఘాల ఆడిట్‌ను పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇంకా ఆడిట్ జరగని సంఘాలు బ్యాంకులో తమ సంఘం పాస్ బుక్‌లను అప్‌డేట్ చేసుకుని ఆడిట్‌కు సహకరించాలని కోరారు. సంఘాల ఆడిట్ వివరాలను లోకో యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. సంఘాల ఆడిట్ జరపకపోతే సెర్ఫ్ నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని, ఆడిట్ జరపడం ద్వారా సంఘాలకు ఆర్థిక పారదర్శికత లభిస్తుందని పేర్కొన్నారు. ఈయనతో పాటు సిసిలు సత్యనారాయణ, సూర్యప్రభ, త్రినాథమ్మ, విఒఎలు ఉన్నారు.



ఆడిట్‌ను పరిశీలిస్తున్న ఎపిఎం శ్యామలరావు

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎపిఎం పైడి కూర్మారావు ఆధ్వర్యాన మండల మహిళా సమైక్య నిర్వహించిన మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్ట రీత్యా నేరమని, ఒకవేళ ఎవరైనా బాల్యవివాహాలను చేసినట్లయితే వాటి వల్ల కలిగే నష్టాలను వారికి వివరించి నిలుపుదల చేయాలని అన్నారు. సమాజంలో ఇతరులకు ఇబ్బంది లేకుండా మన హక్కులను మనం కాపాడుకోవాలని తెలిపారు. తగాదాలు పడి కేసులు, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సామరస్యంగా, పరస్పర అవగాహనతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం అత్యుత్తమమని అన్నారు. అనంతరం ఫుడ్ ఎగ్జిబిషన్‌లో మహిళలు తయారు చేసి తీసుకొచ్చిన తినుబండారాలను రుచిచూసి ఆనందంతో అందరికీ ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది సీపాన గోవిందరావు, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు,



పొందూరు : మాట్లాడుతున్న జడ్జి కృష్ణసాయితేజ



ఆమదాలవలస : మాట్లాడుతున్న జడ్జి మణి

హనుమంతు అచ్చంనాయుడు, మండల మహిళా సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు తమ్మినేని ధనలక్ష్మి, బొడ్డేపల్లి వేణమ్మ, రేణుక, కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు పాల్గొన్నారు.

పొందూరు: మహిళలు తమ హక్కులు, చట్టాలుపై అవగాహనను పెంపొందించుకోవాలని మండల న్యాయ సేవా సంఘం చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.బి.కృష్ణసాయితేజ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా పొందూరు ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. చట్టాలు, హక్కులు, బాలికా సంరక్షణ, భార్యాభర్త మధ్య తగాదాలు వంటి పలు అంశాలుపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.రమణమూర్తి, కె.రఘుబాబు, అశోక్‌కుమార్, పి.రామ్మోహన్, పి.సురేష్‌కుమార్, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మహిళలు ఎంచుకున్న రంగంలో లక్ష్యసాధనకు అడ్డంకులను అధిగమించి రాణించాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. జాతీయ మహిళ దినోత్సవం ఉత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో న్యాయవాదులతో, వెలుగు సిబ్బందితో, అంగన్వాడీ కార్యకర్తలతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళానికి చెందిన ఎన్‌సిడబ్ల్యూ రిసోర్సు పర్సన్స్, సీనియర్ న్యాయవాదులు డి.విజయలక్ష్మి, డి.సరళకుమారి, న్యాయవాదులు పల్లి వాసుదేవరావు, వి.అప్పలనాయుడు, కె.కృష్ణమూర్తి, అంగన్వాడీ సూపర్‌వైజర్ కె.సంధ్యారాణి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : చట్టాలపై అవగాహన అవసరం ఎంతో ఉందని టెక్కలి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ హరిత అన్నారు. స్థానిక దుక్క రాజన్నరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు, వరకట్నం, గృహహింస నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎస్ఐ టి.రాజేష్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ధర్మరాజు, కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని బారువ డిగ్రీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సోంపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాము, ప్రిన్సిపాల్గొన్నారు.



మెళియాపుట్టి : మాట్లాడుతున్న జడ్జి హరిత

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. మండల అధ్యక్షులుగా డి.లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా పొట్నూరు జగదీష్, గౌరవ అధ్యక్షులుగా దూల వైకుంఠరావు, కోశాధికారిగా రోణంకి విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా పాలవలస ధర్మారావు, తమ్మినేని వైకుంఠరావు, బమ్మిడి అరుణకుమార్, మారం కుమారస్వామి, నంబూరు ప్రభావతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకునిగా జిల్లా కార్యదర్శి కురమాన దాలయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమాల ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలను సాధించుకోవచ్చునన్నారు. ఐకమత్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులకు బకాయిపడిన డిఎలను తక్షణమే విడుదల చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



టెక్కలి : ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

పోరాటాలను అణచివేయాలని చూడడం అవివేకమన్నారు.

మండల అధ్యక్షులుగా శివప్రసాద్

నందిగాం : ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.దాలయ్య డిమాండ్ చేశారు. అలాగే సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కాబోతున్న పాలవలస ధర్మారావు అధ్యక్షతన మండలశాఖ ఎన్నిక నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షులుగా ఎన్.శివప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.సురేష్‌కుమార్, కోశాధికారిగా కె.బాపూజీ, సహాధ్యక్షులుగా అప్పలస్వామి, ఎం.బాలామణితో మరో 13 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మందస: మందస మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి ఆర్.పరమేశ్వరరావు, రాష్ట్ర నాయకులు జి.కోదండరావు, జి.రమేష్‌ల ఆధ్వర్యాన స్థానిక యుటిఎఫ్ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. మండలశాఖ నూతన గౌరవ అధ్యక్షులుగా ఎం.జైరామ్, అధ్యక్షులుగా జగదీష్ బడిత్య, సహాధ్యక్షులుగా డి.ఈశ్వరరావు, మహిళ సహాధ్యక్షులుగా ప్రియాంక, ప్రధాన కార్యదర్శిగా కె.సోమేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.సోమనాథులతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు.

రమాప్రభను గెలిపించాలి

టెక్కలి : సామాన్య, మధ్య తరగతి ప్రజల గొంతుకలను వినిపించి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే ప్రజాస్వామ్య వాదుల వైపే మేధావులు ఉండాలని సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కోరుతూ పట్టణంలోని పలు వీధుల్లో శనివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రయివేట్ వైపు మొగ్గు చూపుతుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా వ్యతిరేకతని తెలియజెప్పడానికి ఏకం కావల్సిన ఆవసరం ఏర్పడిందన్నారు. ప్రచారంలో ప్రజా సంఘాల నాయకులు కొల్లి ఎల్లయ్య, ఉర్జాన దుర్గాప్రసాద్, హెచ్.ఈశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉదయ భాస్కర్

జల సంరక్షణ అందరి బాధ్యత

నరసన్నపేట: జల సంరక్షణలో ప్రజల్లో చైతన్యం రావాలని, నీటిని కాపాడుకోవడంలో ప్రభుత్వంతో పాటు ప్రజలూ బాధ్యత వహించాలని స్థానిక గ్రామీణ నీటి సరఫరా విభాగాపు అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన గడ్డయ్యపేటలో జాతీయ జల రక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ తరహాలో నీటి సంరక్షణ కూడా ఒక మహా ఉద్యమంలా సాగాలని కోరారు. ప్రస్తుతం నీటిని పునర్వినియోగించుకునే శాస్త్రీయమైన పద్ధతులు ఎన్నో అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. వీటిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒ జె.రవికుమార్, ఎన్‌వైకె ప్రతినిధి ఉమామహేశ్వరరావు, స్థానిక పాఠశాల హెచ్‌ఎం నల్లబాటి కైలాసరావు పాల్గొన్నారు.



షీల్డ్‌ను అందజేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

విద్యార్థికి అభినందనలు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎండ మల్లేష్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ విద్యార్థికి శనివారం అబినందించారు. ఇటీవల ఒడిశా రాష్ట్రం పూరీలో 44వ సీనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్ర రాష్ట్రం తరుపున జట్టులో మల్లేష్ పాల్గొని విజయం సాధించాడు. మల్లేష్ చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతున్నాడని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.బాలకృష్ణ, బి.సత్యనారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ కంచ్ర వీధి, కోదండరాం వీధి, తెలుకలవీధి, తెలుగు బ్రహ్మణ వీధి, కుమ్మరి వీధిల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎడిఇలె సంపత్‌రావు, శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాడైపోయిన విద్యుత్ స్థంభాలకు బదులు నూతన విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆర్థిక సాయం అందజేత


ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్నకు చెందిన సతివాడ హేమాంబరరావ కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శనివారం ఆర్థికసాయం అందించారు. ఐదు రోజుల క్రితం పక్షవాతానికి గురైన హేమంబిరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం భవన నిర్మాణానికి కార్మికుల యూనియన్ అత్యవసర నిధి నుంచి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ రంగాల శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ చిలకలపూడి కృష్ణారావు, కోశాధికారి ధర్మారావు, యోగి, కాయ శ్రీను, చౌదరి శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

సోంపేట : బారువ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొర్ల జాతీయ రహదారి వద్ద శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవంకు గాయాలయ్యాయి. అదే సమయంలో పలాస నుంచి సోంపేట వెళ్తున్న సిఐ రవిప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని వాహనం క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి సోంపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేఘవరంలో తోటలు దగ్ధం

సంతబొమ్మాళి : మండలంలోని మేఘవరంలో 20 మంది రైతులకు చెందిన 13 ఎకరాల్లో జీడి, మామిడి కొబ్బరి, నీలగిరి తోటలు శనివారం దగ్ధమయ్యాయి. తోటల్లో నుంచి మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు టెక్కలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. సంఘటనా స్థలానికి మేఘవరం సచివాలయం సిబ్బంది, మండల రెవెన్యూ అధికారులు వచ్చి ఆస్తినష్టం అంచనా వేశారు.



దగ్ధమైన జీడి తోటలు

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం



శిక్షణను పరిశీలిస్తున్న నాబార్డు అధికారులు

బూర్జ: తేనెటీగల పెంపకంలో యాజమాన్య పద్ధతుల పాటిస్తే అధిక లాభాలు సంపాదించవచ్చునని నాబార్డు జనరల్ మేనేజర్ మూర్తి అన్నారు మండలంలోని గోపిదేవిపేటలో నాబార్డు సహకారంతో పెద్దపేట ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యాన మహిళలకు జీవనోపాధుల అభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేనెటీగల పంపకంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ంసదర్భంగా మాట్లాడుతూ గ్రామంలో తేనెటీగలు పంపకం వల్ల మహిళలకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. నాబార్డు డిడిఎం నాగార్జున మాట్లాడుతూ మహిళలకు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని తేనెటీగల పెంపకం చేస్తే అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. ఈ శిక్షణలో మహిళలు మెలకువలు పాటించాలన్నారు. రిసోర్స్‌పర్సన్ కాంతారావు మాట్లాడుతూ తేనెటీగలు పెంపకం ఆదివాసీ ప్రాంతాల్లో పువ్వులు నుంచి తేనెను తీసుకున్నామని, దీనిని నేర్చుకుంటే ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిఇఒ శంకరరావు, అనుప్ మన్యం సహజ కంపెనీ ఎం.రవిగణేష్, ఎఫ్ఆర్‌ఒలు, ఆర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఎఫ్ డబ్బులు జమయ్యేలా చర్యలు

పలాస: మున్సిపల్ కార్మికుల పిఎఫ్ డబ్బులు జమయ్యేలా చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు హామీ ఇచ్చారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులుగా పనులను నిలుపుదల చేసి ఆందోళన చేస్తున్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్ సమక్షంలో చైర్మన్ శనివారం చర్చలు జరిపారు. సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్.బలరాం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి మాట్లాడుతూ కార్మికుల పిఎఫ్ డబ్బులు రూ.33.52 లక్షలు కార్మికుల ఖాతాలకు జమ చేయకుండా 11 ఏళ్లుగా ఇబ్బంది పెడుతున్నారని, తక్షణమే పిఎఫ్ డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కార్మికులు గురువారం నుంచి పనులు నిలిపివేశారని తెలిపారు. సెలవులు మంజూరులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని,




కార్మికులతో చర్చిస్తున్న చైర్మన్ గిరిబాబు

మృతి చెందిన కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 20 నాటికి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో కార్మికులు శనివారం నుంచి పనులకు హాజరయ్యారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు సిహెచ్.మురగన్, జె.రవి, ఎస్.రమేష్, బి.కూర్మారావు, యూనియన్ నాయకులు దివాకర్, శంకర్, తిరుపతి, సీతమ్మ, సావిత్రి, శకుంతల, గులాబి పాల్గొన్నారు.

'ఆపస్' పోస్టర్ ఆవిష్కరణ

కవిటి: ఈ నెల 5, 6వ తేదీల్లో నెల్లూరులో నిర్వహించనున్న ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఎంఆర్‌పిలో శనివారం ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆపస్ జిల్లా కోశాధికారి నర్తు సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని అన్నారు. జాతీయ భావాలు కలిగిన ఆపస్ మహాసభలను ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హెచ్‌ఎం సనపల రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం పొందిన ఆపస్ మహాసభలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. మండల అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, మోహన రావు, అర్జునుడు, తమ్మయ్య, రామారావు, సునీత, రాజేశ్వరి, జగన్నాథరావు, శరత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడ్డెమ్మ

పరీక్షలు అంటే భయపడొద్దు

టెక్కలి రూరల్ : పదో తరగతి విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని సోషల్ వెల్ఫేర్ డిడి. జి.గడ్డెమ్మ అన్నారు. సమీకృత బాలికల వసతిగృహంలో పదో తరగతి విద్యార్థులతో అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే సిలబస్ పూర్తయిందన్నారు. మరలా సబ్జెక్టులను రివిజన్ చేసుకొని పాఠ్య పుస్తకాలను శ్రద్ధగా చదవాలని సూచించారు. అలాగే పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలకు బాగా తెలిసిన జవాబులను ప్రాధాన్యత క్రమంలో రాయాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ దివ్వల ప్రసాదరావు, వార్డెన్ గురువెల్లి వెంకట విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ఉమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడ్డీలను తొలగించాలి

- మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కూరగాయల మార్కెట్ ముందు బాగాన ఏర్పాటు చేసిన ఆక్రమణ బడ్డీలను వెంటనే తొలగించాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పి.నాగరాజు మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడుకు ఆదేశించారు. ం వార్షిక తనిఖీల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతకొద్ది రోజులుగా 'ప్రజాశక్తి'లో ఆక్రమణలపై కథనాలను చూశానని, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎటువంటి ఆక్రమణలను ప్రోత్సహించేదే లేదని తేల్చిచెప్పారు. పర్యావరణ పరిరక్షణకు హాని కలిగించే అంశాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సమస్యను, విషయాన్ని వివరించి ఇటువంటి చర్యలకు ఎవరు పూనుకోకుండా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పురపాలక సంఘానికి బకాయిపడిన పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. వేసవి తాగునీటి ఎద్దడిపై తీసుకోనున్న కార్యాచరణను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలని, వీధిలైట్లు నిర్వహణ క్రమబద్ధీకరించాలని, అక్రమ కట్టడాలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలపై విమర్శలకు తావులేకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. సందర్శనలో భాగంగా స్థానిక కంపోస్టుయార్డును పరిశీలించారు. యార్డులో చెత్త నిర్వహణపై అనుసరించాల్సిన వ్యూహంపై సూచనలు చేశారు. పరిశీలనలో ఎఇ బి.సృజన, టిపిఎస్ హెచ్.వి.సత్యనారాయణ ఉన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి : జనసేన

మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు కోఆరరు. మున్సిపల్ కార్యాలయంలో రీజనల్ డైరెక్టర్ పి.నాగరాజును



వినతిపత్రం అందజేస్తున్న రామ్మోహనరావు

కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో 250 పైచీలుకు చెరువులు ఉన్నాయని, వాటిలో సగానికి సగం ఇప్పటికే కబ్జా అయ్యాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పట్టణంలోని మున్సిపాలిటీ నిర్మించిన కూరగాయల మార్కెట్ ముందు బాగాన అధికార పార్టీ కార్యకర్తలు స్థలాలను ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేశారని చెప్పారు. ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను ఇప్పటికే అద్దెలకు కూడా ఇచ్చేశారని, వాటిని వెంటనే అక్కడి నుంచి తొలగించాలని కోరారు. సావధానంగా విన్న ఆర్‌డి బడ్డీలను వెంటనే తొలగించాలని కమిషనర్ అప్పలనాయుడుకు ఆదేశించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో నానాటికీ తీవ్రమవుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్టు, అవుట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఎపి జెఎసి అమరావతి కార్యాచరణపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసి ఇన్‌ఛార్జి కమిషనర్ కె.అపలనాయుడును, ఉద్యోగులను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ సమస్యల పరిష్కారంలో భాగంగా స్వయంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలే అమలుకు నోచుకోకపోవడం



మాట్లాడుతున్న కృష్ణమోహన్

శోచనీయమన్నారు. ఉద్యోగులంటే ప్రభుత్వంలో భాగమేనని, అలాంటి ఉద్యోగుల న్యాయపరమైన సమస్యల పరిష్కారంలో తాత్సారం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో నాయుడు బాబు, మేనేజర్ బి.లక్ష్మీనారాయణ, టిపిఎస్ హెచ్.వి.సత్యనారాయణ, ఆర్ఐ డి.రామారావు, కె.వి.సుబ్రహ్మణ్యం, అకౌంటెంట్ ఐ.సాయిరాం, బి.శ్రీనివాసరావు, ఎస్.హరీష్, జె.శ్రీనివాసరావు పద్మనాభం, హరిబాబు పాల్గొన్నారు.

లక్ష్యాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- జి.సిగడాం

మహిళా సంఘాలకు సంబంధించి ఈ-ఫైనాన్స్, జగనన్న తోడు, స్త్రీనిధి లోన్లు, ఉన్నతి రుణాల రికవరీ లక్ష్యాలు వంద శాతం పూర్తి చేయాలని డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ సూచించారు. ఎపిఎం కార్యాలయంలో విఒఎలతో శనివారం సమీక్షించారు. సమావేశంలో ఎపిఎం రెడ్డి రామకృష్ణనాయుడు, మండల సమైక్య అధ్యక్షులు వాన ప్రమీలాదేవి, కోశాధికారి నీలవేణి, ఎల్‌హెచ్‌ఎపి ఎం.హరికృష్ణ, స్త్రీనిధి మేనేజర్ ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ విద్యాసాగర్

ఇమ్యునైజేషన్ డ్రైవ్ విజయవంతం

ప్రజాశక్తి- పోలాకి

ప్రత్యేక ఇమ్యునైజేషన్ డ్రైవ్ విజయవంతం చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ, ఎఫ్‌పిసి జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీతులసి సూచించారు.



పొందూరు : పరిశీలిస్తున్న శ్రీదేవి

పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సంతలక్ష్మీపురంలో ఇమ్యునైజేషన్ డ్రైవర్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఎంసిపి కార్డుల తనిఖీ, వ్యాక్సినేషన్ ప్రోటోకాల్ సరిగా పరిశీలిస్తున్నారా? లేదా? అన్న అంశంపై ప్రత్యేక దృష్టిసారించారు. వ్యాక్సినేషన్ సెషన్ సైట్, సామర్థ్యం, శీతలీకరణ స్థాయి అంశాలపై ఆరోగ్య విస్తరణ అధికారి డాక్టర్ నల్లి రవికుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వాన సురేష్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎంఎల్‌హెచ్‌పి ద్రాక్షాయనిదేవి, ఎఎన్ఎం రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రాపాక సచివాలయం-2 పరిధిలోని వావిలపల్లిపేటలో చేపడుతున్న వ్యాదినిరోధక టీకా కార్యక్రమాన్ని యూనివర్శిల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ శ్రీదేవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతినెలా క్రమం తప్పకుండా మొదటి బుధ, శనివారం, రెండో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఆర్‌సిహెచ్ పోర్టల్, పాఠశాల విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ, గర్భిణుల, బాలింతల సంరక్షణకు సంబంధించిన పలు అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి జ్యోత్స్న, ఎఎన్ఎం వనజాక్షి, హెల్త్ అసిస్టెంట్ రమణ, అంగన్వాడీ కార్యకర్త అలివేలు, ముత్యాలమ్మ పాల్గొన్నారు.



పోలాకి : పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ లక్ష్మీతులసి


పరామర్శిస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' పరామర్శ

మెళియాపుట్టి : మండలంలో వసుంధర, శేఖరాపురం, మెళియాపుట్టి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు శనివారం పరామర్శించారు. మెళియాపుట్టికి చెందిన రెడ్డికి కార్పొరేషన్ డైరెక్టర్ కప్పు భాను ప్రకాష్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో వాళ్ల కుటుంబీకులను కలిసి పరామర్శించారు. శేఖరాపురానికి చెందిన గోక ఢిల్లీరావు ఇటీవల మృతి చెందడంతో వాళ్ల కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. వసుంధరకు చెందిన మాజీ ఎంపిపి సలాన మోహనరావు సోదరుడు ఎరుకునాయుడు ఇటీవల మృతి చెందడంతో వాళ్ల కుటుంబీకులనూ కలిసి పరామర్శించారు. ఈయనతో పాటు ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, గంగాధర్, పోలినాయుడు, కూర్మారావు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న ధనలక్ష్మి

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

సోంపేట: మండలంలోని పలాసపురం సచివాలయం పరిధిలో స్థానిక మహిళా పోలీస్ ధనలక్ష్మి ఆధ్వర్యాన మహిళలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. దిశా యాప్ ఉపయోగం, మహిళా చట్టాలు, ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

సిడిపిఒ బాధ్యతల స్వీకరణ

పొందూరు: ఐసిడిఎస్ ఎస్.ఎం.పురం ప్రాజెక్టు పొందూరు సిడిపిఒగా డి.పాపినాయుడు శనివారం బాధ్యతలను చేపట్టారు. ఈయన కాశీబుగ్గ ఎసిడిపిఒగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే ఇక్కడ సిడిపిఒగా పనిచేసిన రూపవతి కోటబొమ్మాళి ఎసిడిపిఒగా బదిలీపై వెళ్లారు. సిడిపిఒగా బాధ్యతలు చేపట్టిన పాపినాయుడుకు ఐసిడిఎస్ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

వ్యక్తి అరెస్టు

బూర్జ : మండలంలోని ఎబిసి పేటలో హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు శనివారం తెలిపారు. ఇటీవల గ్రామ సమీపంలోని తోటలో కొట్లాట జరిగిన సమయంలో జమ్మన సుదర్శనరావును హోమ్‌గార్డు ఎ.రమణమూర్తి హత్య చేసినట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. దీంతో శ్రీకాకుళం ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఎస్.వాసుదేవరావు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని తెలిపారు.

డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మేజర్ పంచాయతీపై వచ్చిన ఫిర్యాదులపై, అభియోగాలపై కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారి సూచన మేరకు శ్రీకాకుళం డిఎల్‌పిఒ పి.ప్రకాశరావు పంచాయతీ కార్యాలయంలో శనివారం విచారణ చేపట్టారు. పంచాయతీకి చెందిన ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ తీర్మానం లేకుండా విక్రయించారని, ఆర్థిక లావాదేవీల విషయంలో అవకతవకలు జరిగినట్లు కొద్దిరోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ ఫిర్యాదులపై పంచాయతీ వార్డు సభ్యుల నుంచి విచారణ చేయడంతో పాటు రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ట్రాక్టర్, ట్యాంకర్‌ను తీర్మానం లేకుండా విక్రయించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టమని తెలిపారు. మినిట్ బుక్‌లో ఎవరికి కొటేషన్ ఇవ్వడం జరిగిందనే విషయాలు లేవని చెప్పారు. పాలకవర్గ సమావేశంలో చర్చించిన అంశాలకన్నా సభ్యులకు తెలియకుండా మినిట్ బుక్‌లో ఎక్కువ తీర్మానాలు పొందిపరిచినట్లు గుర్తించామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీకి కేటాయించిన బడ్జెట్‌కు మించి పనులు చేసినట్లు గుర్తించామన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. పంచాయతీ ఆర్థిక లావాదేవీలపై వచ్చిన ఫిర్యాదులపై త్వరలో పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. ప్రస్తుత విచారణపై కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ఈయనతో పాటు ఎంపిడిఒ కార్యాలయ పరిపాలనాధికారి మురళి ఉన్నారు.


విచారణ చేస్తున్న డిఎల్‌పిఒ ప్రకాశరావు

వేరుశనగ సాగుపై శిక్షణ

కోటబొమ్మాళి: మండలంలో రబీ సీజన్‌లో 3,500 ఎకరాల్లో వేరుశనగ సాగు రైతులు చేస్తున్నారని, ప్రస్తుతం ఈ సాగు పూత పిందె దశలో ఉందని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు అన్నారు. వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా స్థానిక వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావుతో కలిసి మండలంలోని పెద్దబమ్మిడిలో గ్రామ వ్యవసాయ సహాయకులతో వేరుశనగ పంటలను శనివారం పరిశీలించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సాగుకు పొగాకు లద్దెపురుగు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉందని, దీని నివారణకు ఇమామెక్టిన్ బెంజిమెట్ ఎకరాకు వంద గ్రాములు మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాలర్‌రాట్ మొక్కలకు వచ్చి చనిపోతాయని, దీని నివారణకు డైథేన్ ఎం-45 అను మందును ఎకరాకు 400 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న ఎడిఒ తిరుమలరావు

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి శనివారం సందర్శించారు. ఆయనకు ఆలయ సాంప్రదాయాలతో అర్చకులు స్వాగతించారు. అనంతరం ఆయన స్వామివారి సేవల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ఆయనకు ఆలయ అధికారులు జ్ఞాపికను అందజేశారు. అనంతరం శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథస్వామి ఆలయాన్నీ సందర్శించారు. అనంతరం అరసవల్లి అర్బన్ హెల్త్ సెంటర్, వప్పంగి సబ్ సెంటర్, శ్రీకూర్మం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎయిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, ఎస్‌పి హెచ్ఒ డాక్టర్ ఎన్.రామిరెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, మంత్రి వెంకటసామి, డాక్టర్ పద్మావతి, నాగభూషణం, నాగేశ్వరరావు, మోహిని పాల్గొన్నారు.


దర్శించుకుంటున్న ముఖేష్ త్రిపాఠి


పనులను పరిశీలిస్తున్న దాసురాజు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీలో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు ఆధ్వర్యాన శనివారం పారిశుధ్య పనులను నిర్వహించారు. మూడు రోజులుగా కాలువలను పూడికలు తీసి, చెత్తను తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. ఆశా వర్కర్ సూరాడ పార్వతి, అనుపిళ్ళి కృష్ణవేణి పాల్గొన్నారు.


మెమెంటోను అందుకుంటున్న విద్యార్థిని

విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కోరమండల్ ఫెర్టిలైజర్ సంస్థ ఇటీవల విద్యాభివృద్ధి - సామాజిక బాధ్యత అనే అంశంపై గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కారాల పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు దళ్లి స్రవంతి, బొడ్డ మానసలు ఎంపికయ్యారు. వీరికి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఆ సంస్థ జనరల్ మేనేజర్ కీర్తికృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రథమ బహుమతికి రూ.5 వేలు, ద్వితీయ బహుమతికి రూ.3,500 నగదులు, మెమెంటో, ధ్రువపత్రాలను శనివారం అందజేశారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం యు.గణపతి రావు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఎం.ఫాల్గుణరావు, ఉపాధ్యాయులు, సిఆర్‌పి ఎన్.సవరయ్యలు అభినందనలు తెలిపారు.



ఆట వస్తువులను అందజేస్తున్న జయశ్రీ

ఆట వస్తువులు వితరణ

పలాస: పలాస ఎంపిపి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ క్యాజు ల్యాండ్ వనిత విద్యార్థులకు శనివారం ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు మల్లా జయశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. ఆటలు ఆడే సమయంలో ఆటలాడాలని, చదువుకున్న సమయంలో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఆటలకు సంబంధించి టెన్నిస్ రింగ్స్, స్కిప్పింగ్ రోప్స్, వాలీ బాల్స్, చెస్ బోర్డ్స్, లుడు బోర్డ్స్, క్యారం బోర్డ్ ఇంకా పలు రకాల ఆట వస్తువులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి తర్లాలన శ్వేతకుమారి, కోశాధికారి మల్లా సంతోషి, బల్ల ఉషా, కొంచాడ జ్యోతి, దేవరశెట్టి జ్యోతి, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'కు స్పందన

కోటబొమ్మాళి : విశాఖపట్నంలో ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు అనూహ్య స్పందన లభించిందని వైసిపి నాయకులు, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురునాథ్ యాదవ్ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. విశాఖ వేదికగా రాష్ట్రానికి అనేక మంది పారిశ్రామిక వేత్తలు వచ్చి పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచంలోని ఎక్కువ దేశాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్త లు ముందుకు వచ్చారన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.


జీవామృతాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

జీవామృతం తయారీ

ఆమదాలవలస : ప్రకృతి వ్యవసాయమే నేలను కాపాడుతుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం చేయడం రైతులకు అవసరమని అన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఘనజీవామృతం, ద్రవ జీవామృతం తయారు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నీలవేణి, హరికుమార్, సునీత, కిరణ్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


వజ్రపుకొత్తూరు : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నర్సింగరావు

వజ్రపుకొత్తూరు : చెడు వ్యసనాలకు, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని స్ఫూర్తి పోలీస్ బృందం జిన్నారావు, సత్యరాజ్, రవి, అనూషలు అన్నారు. మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'మహిళ భద్రత మా బాధ్యత' అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్లు జూనియర్లకు ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమను సంప్రదిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రేమ పేరుతో జీవితాలన నాశనం చేసుకోవద్దని అన్నారు. చిన్న చిన్న కారణాలకు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోకూడదన్నారు. ఒక్క క్షణం ఆలోచన చేస్తే దానికి పరిష్కార మార్గం దొరకుతుందన్నారు. సమస్యలు వస్తే 100 డయల్ చేయాలని, లేదంటే మీకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్ఫూర్తి బృందం కుసుమ, జీవన్, మురళి, జంగమయ్య, కళాశాల అధ్యాపకులు వి.వి. రమణమూర్తి, తిరుపతి, గణేష్, శోభారాణి, భాగ్యవతి, వాణి పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యాన 'స్ఫూర్తి'

మెళియాపుట్టి : స్థానిక పోలీసుల ఆధ్వర్యాన మండలంలోని కొసమాల చాపర ఉన్నత పాఠశాల, చాపర ఎస్‌కెకె జూనియర్ కళాశాలలో శనివారం స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ నర్సింగరావు మాట్లాడుతూ బాలికలు ఇతరుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌కెకె ప్రిన్సిపాల్ ఎస్.దయానంద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న పోలీసులు